# తుఫాను సమకూడుతుంది[1]

## చదువుటకు నియమించినవి #7

V. రెండవ పస్కానుండి మూడవ దాని వరకు.
   A. సబ్బాతున అంగవికలుని స్వస్థపరచి తన కార్యమును న్యాయమని తెలుపుట (యోహాను 5:1–47).
   B. సబ్బాతు దినాన వెన్నులు తుంచి తన శిష్యులను కాపాడుట (మత్తయి 12:1–8; మార్కు 2:23–28; లూకా 6:1–5).
   C. సబ్బాతు దినాన ఊచచేయిగలవానిని బాగు చేయుట న్యాయమేనని చెప్పుట (మత్తయి 12:9–14; మార్కు 3:1–6; లూకా 6:6–11).
   D. గలిలయ సముద్రపు దరిని జనసమూహములను యేసు స్వస్థపరచుట (మత్తయి 12:15–21; మార్కు 3:7–12).
   E. ప్రార్థన అనంతరం, తన పన్నిద్దరు అపొస్తలులను యేసు ఏర్పరచుకొనడం (మత్తయి 10:2–4; మార్కు 3:13–19; లూకా 6:12–16).

## పరిచయం

క్రీస్తు తన గొప్ప గలిలయ పరిచర్యను కొనసాగించాడు, ఆయన కీర్తి వ్యాపించింది. జనసమూహాలు ఆయన బోధ వినడానికిని, ఆయనచే స్వస్థతను పొందడానికి తరలి వస్తున్నారు. ఈ పాఠంలో చర్చింపబడిన కాలంలో ప్రభువు తన పన్నిద్దరు అపొస్తలులను ఏర్పరచుకున్నాడు ప్రఖ్యాతిగాంచిన కొండమీద ప్రసంగానికి రంగం సిద్ధంచేయబడింది – దీన్ని రాబోయే రెండు పాఠాలలో చర్చించబోతాం.

ఈ కాలంలో ముఖ్యమైనదేమంటే – యూదా మత నాయకులతో విరోధం ఎక్కువ కానుంది. గూఢాచారులు ప్రతిచోటికి ఆయనతో వెళ్లుతున్నారు. నేరం మోపడానికి తగిన హేతువేదైనా కనిపెట్టడమే వారి పని (మార్కు 3:2; మత్తయి 12:10). తన శత్రువులు పన్నిన వలను క్రీస్తు తప్పించుకొని వెళ్లినప్పుడు, వారు కోపంతో మండిపడసాగారు (లూకా 6:11). "ఆయనను ఏలాగు సంహరింతుమా అని ఆయనకు విరోధంగా" పరిసయ్యులు ఆలోచన చేశారని మత్తయి రాశాడు (మత్తయి 12:14; మార్కు 3:6ను చూడు). "యూదులు యేసును హింసించిరి" అని – "ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి" అని యోహాను దాఖలు చేశాడు (యోహాను 5:16, 18).

యూదా మతనాయకుల అర్థరహితమైన ద్వేషాన్ని గూర్చి రాయడం అవసరమని సువార్త లేఖికులు ఎందుకు తలంచారు? యేసును సిలువవేయడంలో వారి భాగాన్ని తేటగా ఉంచుకోవాలనే ఉద్దేశమే అయ్యుండవచ్చు. రోమా సిలువ మీద చనిపోవడం కంటే ఆ కాలంలో యింకా పొందగల ఏ అవమానమో హింసయో లేదనే చెప్పాలి

(హెబ్రీ. 6:6; 12:2 చూడు). "యేసు నిజంగానే పరిపూర్ణుడైన వ్యక్తి అయ్యుంటే, శిక్షవిధింపబడిన నేరస్థుడుగా ఆయన ఎందుకు చనిపోవాలి?" అని సందేహవాదులు అడుగవచ్చునని నేను ఊహిస్తున్నాను. ఈలాటి ప్రశ్నకు జవాబు యివ్వడానికి ఈ లేఖన భాగాలు సహాయపడతాయి.

మనము మొదటిగా సంఘర్షణను చూపే మూడు ఉదాహరణలను గమనించుదాం. కొంతవరకు – వ్యతిరేకత యొక్క ప్రభావాలను – ఎదుర్కొనడానికి ప్రభువు ఏమి చేశారో తరువాత చూద్దాం.

## వ్యతిరేకతకు మాటలతో బదులిచ్చుట

ఈ పాఠంలో వ్యతిరేకత సబ్బాతు ఆచారాలకు సంబంధించినది. ఆరు సబ్బాతు వాగ్వాదాలు జరిగినట్టు సువార్త రచనలు చెప్పుతున్నాయి. ఇందులో మనం మూడింటిని చదువుదాం.

"సబ్బాతు" అంటే ప్రాథమికంగా విశ్రాంతి అని అర్థం. దేవుడు లోకమును సృజించినప్పుడు, ఆయన ఏడవ దినమున విశ్రమించాడు (ఆది. 2:1–3). తరువాత, ఏడవ దినపు విశ్రాంతిని, పది ఆజ్ఞలలో ఒక భాగంగా ఆయన యిచ్చాడు (నిర్గమ 20:8–11). సబ్బాతు విశ్రాంతి దినం, దేవుని గూర్చి ఆలోచించుకొనడానికిని, ఆనందించడానికిని అనుగ్రహింపబడిన సమయమది. సబ్బాతు దినాన్ని తప్పక ఆచరించేటట్టు, దాన్ని అతిక్రమించినవారికి కఠినమైన శిక్ష నియమింపబడింది (సంఖ్యా. 15:32–36; నెహెమ్యా 13:15–22; యిర్మీయా 17:19–27).

దేవుని చట్టాలు తగినంత కఠినంగా ఉన్నాయి. అయితే మనుష్యులు వాటిని అక్కడే వదిలేయడానికి యిష్టపడడం లేదు. H. I. Hester యిలా వ్రాశాడు:

> ఈ దినాన్ని ఆచరించడం బహు కష్టతరంగాను మిక్కిలి భారంగాను పెంపొందింది. మోషే పెట్టిన నిర్బంధాలు విస్తరింపచేయబడి వందల సంఖ్యలోనికి మారే విధంగా హెచ్చించబడ్డాయి. ఈ కట్టడులలో అనేకాలు హాస్యాస్పదమైనవి; ఉదాహరణకు సబ్బాతు దినాలు కట్టుడు పండ్లు ఉంచుకొనడం, బరువులు మోయడంగా ఎంచబడేది. అది తెల్లవెంట్రుక ఒక దాన్ని లాగివేసినా లేక గోధుమ గింజను ఎత్తిపట్టుకున్నా, కనీసం రెండు అక్షరాలను చేర్చి వ్రాసినా సరే[3] సబ్బాతు దినాన్ని మీరినట్టే ఔతుందట. ఇలా విస్తృతమైన కట్టడులు సబ్బాతును అచరించడాన్ని అసాధ్యంగా చేసింది ... ఈ విధానమంతా సబ్బాతు స్వభావాన్ని ధ్వంసంచేసినట్టే అవుతుంది.[4]

Warren Wiersbe యిలా అన్నాడు: "వారు సబ్బాతును తీసికొన్నారు – మనిషికి దేవుని యీవి – కట్టుబాట్లు నిర్బంధములతో కూడిన బందీగృహముగా వారు రూపొందించారు."[5]

ప్రభువును వలలో చిక్కించుకోవాలనుకున్న యూదులకు వారు చేసికొన్న సబ్బాతు దినాచారాలు తెలియని చిక్కులతోకూడిన "వారి ప్రియమైన చట్టం" ఉపయోగించింది.[6] సబ్బాతు కట్టుబాట్లను ఎవ్వడూ పరిపూర్ణంగా నెరవేర్చలేనివాడైయున్నను, వాటిని మీరినప్పుడు క్రీస్తును పట్టుకొనడంలో వారికి సమస్య కాదనుకున్నారు – ఆలాటి అతిక్రమణ మరణదండనకు లోనుజేస్తుంది (సంఖ్యా. 15:32–36)![7]

**సబ్బాతు దినాన దీర్ఘకాలపు రోగిని బాగుచేయడం (యోహాను 5:1–47)**

మన గత పాఠం ముగింపులో ఉండగా, క్రీస్తు గొప్ప గలిలయ పరిచర్యలో మునిగి ఉన్నాడు. ఈ పాఠం ఆరంభం కాగా, మతసంబంధమైన పండుగకొరకు యేసు యెరూషలేము వెళ్లాలన్న మనస్సు గలవాడైనట్టు కన్పిస్తాడు (యోహాను 5:1). పస్కా, పెంతెకొస్తు, పర్ణశాలలనే[8] మూడు పండుగలకు యూదులు యెరూషలేము వెళ్లవలసిందిగా వారి ధర్మశాస్త్రము – ఆదేశించింది–మరియు యేసు ఎల్లప్పుడు ధర్మశాస్త్రాన్ని అతిక్రమించ లేదు (మత్తయి 5:17). ఈ పండుగ ఏదో మనకు నిశ్చయంగా తెలియదు. అయినా యిది పస్కా అనుకోడానికి అవకాశముంది.[9] ఏదియెలాగున్నా, మన పాఠం కొరకు దీన్ని పస్కాపండుగ అనుకుందాం.

గతించిన పస్కాపండుగ సమయంలో, దేవాలయంలో ఉండి మతసంబంధమైన వ్యాపారాలను చేసే వారిని యేసు దేవాలయంనుండి తోలివేసి యూదా మత నాయకులకు కోపం కలిగించాడు.[10] ఈ పండుగ సమయంలో సబ్బాతు దినాన బేతెస్ద కోనేటివద్ద నున్న ఒక రోగిని స్వస్థపరచడంవలన ఆయన వారికి బహు కోపం పుట్టించాడు. ఆ అద్భుతాన్ని యోహాను ఈ మాటలతో దాఖలు చేశాడు: "యేసు – నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుమని వానితో చెప్పగా వెంటనే వాడు స్వస్థతనొంది తన పరుపెత్తికొని నడిచెను" (యోహాను 5:8, 9ఎ). తరువాత యోహాను ఈ ముఖ్యమైన ప్రతిపాదనను చేర్చాడు: "ఆ దినము విశ్రాంతి దినము" (10 వ.). రబ్బీల పరంపర ప్రకారం, సబ్బాతు దినాన ఒకని తన చాపమీద కొనిపోవచ్చు (వారి తత్వంలో చాప అనేది "అప్రస్తతం"), అయితే చాపను మోసికొని పోవడం చట్ట విరుద్ధం.

చాపను చంకనపెట్టుకొని వెళ్లుతున్న మనిషిని యూదా మతనాయకులు మొదట తీవ్రంగా అడ్డగించారు. అయితే తన పరుపెత్తికొని వెళ్లుమని చెప్పింది యేసు అని వారు తెలిసికొన్నప్పుడు, వారు ఆయనపై ఎదురు తిరగాలనుకున్నారు. ఆయనను వారు అలా ఎదిరించినందువలన ఆయన తన్ను తాను న్యాయ నిరూపణ చేసికొనడానికి చేసిన ప్రసంగం రికార్డు చేయబడింది.[11]

ఈ సందర్భంలో న్యాయనిరూపణకు యేసు చెప్పిన సంగతి – దేవుడు సబ్బాతు దినాన "పని" చేయగలిగినట్టయితే, తాను చేయగలనని ఆయన చెప్పాడు (17 వ.).[12] తానునూ తన తండ్రియూ భాగస్వాములుగా ఉండి జరుపుతున్న కార్యాలను ఆయన వారికి ఉదాహరణగా చూపాడు (19–30 వచనాలు). ఆయన దైవ సమానునిగా తెలపడం యూదులకు భీతి కలిగించింది. ఆయన తన్ను "దేవునితో సమానునిగా" చేసికొంటున్నాడని వారాయనతో అన్నారు (8 వ.)! తాను ఏమైయున్నానని ఆయన తన్ను గూర్చి చెప్పుకుంటున్నాడో దానికి సంబంధించిన రుజువులను క్రీస్తు వారి ఎదుట ఉంచాడు: బాప్తిస్మమిచ్చు యోహాను, ఆయన చేస్తున్న అద్భుతాలు, లేఖనాలు, అందులో ప్రత్యేకించి దేవుడు తనకు సాక్షియైయున్నట్టు ఆయన సూచించాడు (31–47 వచనాలు). ఆ సందర్భంలో యేసు తన శత్రువులతో పలికిన మాటలు "పరిశుద్ధ లేఖనాల్లో బహు లోతైనవియు విషయ గర్భితమైనవై యున్నాయని" బర్టన్ కఫ్మన్ అన్నాడు.[13]

ఈ సంఘటన సంభవించిన కొద్ది కాలంలోనే యేసు యెరూషలేమును విడిచిపెట్టాడు.

యెరూషలేముకు సంబంధించిన ఈ ప్రయాణాన్ని గురించి మరి ఇక ఏమీ నమోదు చేయబడలేదు.

### సబ్బాతు దినాన వెన్నులు తుంచి తినడం

### (మత్తయి 12:1–8; మార్కు 2:23–28; లూకా 6:1–5)

క్రీస్తు గలిలయకు తిరిగివచ్చిన తరువాత,[14] ఆయనయు, ఆయన శిష్యులును పంటపొలములలో గుండా వెళ్లుతున్నారు. "ఆయన శిష్యులు ఆకలిగొనినవారై, వెన్నులు[15] తుంచుకొని తినసాగారు" (మత్తయి 12:1). "చేతులతో నలుపుకొని" అనే మాటలను లూకా చేర్చుతున్నాడు (లూకా 6:1). కంకుల ధాన్యం మీద పొట్టు ఉంటుంది గనుక దాన్ని తొలిగించి తినడం అవసరమైయుంటుంది. గనుక ఆ పొట్టును పోగొట్టడానికి వారు తమ చేతులతో నలుపుకొంటున్నారు. నలిపిన తరువాత పొట్టును ఊది పొట్టుపోయిన తరువాత నోటిలో వేసికొంటారు.

వారు వెన్నులు తుంచుకొని నలుపుకొని, ఊదిన తరువాత వాటిని నవులుతూ ఉండగా, తటాలున పరిసయ్యులు గుంపు కన్పించి, వారు సబ్బాతు దినాన్ని మీరినట్టు శిష్యులపై నేరం మోపారు[16] (ఈ దృశ్యంలో కొంత హాస్యం కనబడుతుంది. పరిసయ్యులు ఆడంబరమైన దుస్తులను ధరించి, పంటపొలాలలో వంగి దాగుని యేసుమీద నేరం మోపడానికి వేచి ఉండడం, వారి ఆచారాలకు కొంత భిన్నంగా ఉంటుంది!)

మరొకరి ధాన్యాన్ని వారు దొంగిలిస్తున్నారనే నేరం కాదది. పొలాల్లో గుండా వెళ్లేటప్పుడు వెన్నులు తుంచి తినడానికి ధర్మశాస్త్రం అనుమతినిచ్చింది (ద్వితీయో. 23:25). పనిని గూర్చిన సబ్బాతు చట్టాలు ఉల్లఘించరాని వారు మోపే నేరం. పరిసయ్యులకు సంబంధించినంతమట్టుకు, ఏదియెలా జరిగినా, వెన్నులు తుంచుకొని, నలుపుకొని తినడంలో ప్రభువు శిష్యులు నేరస్థులే. నీవు ఏలాటి వ్యాఖ్యానం చెప్పదలచుకున్నా అక్కడ పాయింటు అది. సబ్బాతును మీరడం అనేది వారి ముఖ్యమైన నేరస్థాపన.

యేసు డిఫెన్స్ యిక్కడ యెరూషలేములో చేసిన దానికి భిన్నమైనది. నిరపరాధులకు వారు తీర్పు తీర్చుతున్నట్టు ఆయన పరిసయ్యులకు తెలిపాడు (మత్తయి 12:7). అంటే, "దోషులు కారు" (ఆయన శిష్యులు ఆ పని చేయడంలో దోషులు కారని) అని ప్రభువు అన్నాడు.

(1) "దోషులు కారు" – తన ఆకలిని తీర్చుకొనడానికి సముఖపు రొట్టెలు తిన్న దావీదు ఎలా దోషికాలేదో అలాగే యిదియు అని ఆయన వివరించాడు (మత్తయి 12:3, 4; లూకా 6:3, 4; 1 సమూ. 21:6; లేవీ. 24:5–9లను చూడు).[17]

(2) "దోషులు కారు" ఎందుకంటె సబ్బాతు దినాన పనిచేసిన యాజకులను దోషులుగా పరిగణించబడలేదు (మత్తయి 12:5; సంఖ్యా. 28:9,18, 19). యాజకులకు సబ్బాతు దినమే విరామం లేని దినమైయుంటుంది.

(3) "దోషులు కారు" ఎందుకంటే, సబ్బాతు దీవెనగా ఉద్దేశింపబడిందేగాని భారంగా ఉండడానికి కాదు: "విశ్రాంతి దినము మనుష్యులకొరకే నియమింపబడెను గాని

మనుష్యులు విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు" (మార్కు 2:27). బహు సాధారణమైన ఆహారమును కూడా సబ్బాతు దినాన శిష్యులు పొందకూడదనడం వారి మీద భారము మోపడమే ఔతుంది.

(4) "దోషులు కారు" – (ఆకలితో చేర్చి) బాధను తొలిగించడం, కర్మకాండను ప్రత్యేకించి మానవ కల్పితములైన కర్మకాండను నెరవేర్చడం కంటె ఎంతో ముఖ్యమైనది. హోషయ 6:6లోని వర్తమానాన్ని ప్రభువు తనపై నేరం మోపేవారికి గుర్తు చేస్తున్నాడు: "కనికరమునే[18] కోరుచున్నాను గాని బలిని నేను కోరను" (మత్తయి 12:7).

(5) "దోషులు కారు" ఎందుకంటే, మెస్సీయ మనుష్యుల సంప్రదాయాలకు లోను కాదు. పరిసయ్యులకు మింగుడుపడని రెండు ప్రతిపాదనలను యేసు చేశాడు: "దేవాలయము కంటె[19] గొప్పవాడిక్కడ[20] నున్నాడని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 12:6). "కాగా మనుష్యకుమారుడు విశ్రాంతి దినమునకు ప్రభువైయున్నాడనెను" (మత్తయి 12:8; మార్కు 2:28; లూకా 6:5లను చూడు). యేసు తన్ను గూర్చి ఈ సంగతులు చెప్పుకొంటున్నట్టు విదితమైయుంది. సబ్బాతుకు సంబంధించి పాత నిబంధన నియమావళిలో ఏమి చేయవచ్చు చేయకూడదని తీర్మానించే అధికారం వారికి కాదు తనకే ఉన్నట్టు ప్రభువు తేటపరిచాడు.

కోపముతో మండిపడి, గొణుగుకొంటూ పరిసయ్యులు వెళ్లి ఉండవచ్చు.

## ఊచచెయ్యి గల వానిని సబ్బాతు దినాన బాగు చేయుట (మత్తయి 12:9–14; మార్కు 3:1–6; లూకా 6:6–11)

అటు తరువాత త్వరలోనే,[21] "మరొక సబ్బాతు దినాన," ఆయన ఉపదేశించడానికి అనుమతించిన ఒక సమాజమందిరానికి వెళ్లాడు (లూకా 6:6). మత్తయి ప్రకారము, "ఆయన వారి సమాజమందిరములో ప్రవేశించాడని" సూచింపబడింది (మత్తయి 12:9).

అంటే, పంటపొలంలో ఆయనపై నేరం మోపనుద్దేశించిన పరిసయ్యులుండే సమాజ మందిరం సూచింపబడింది. "ఊచచెయ్యి గలవాడొకడు కనబడెను" (మత్తయి 12:10). (ఆయనను ఉరికెక్కించడానికి క్రీస్తు శత్రువులే వానిని అక్కడికి తెచ్చియుంటారా?) "విశ్రాంతి దినమున వానిని స్వస్థపరచునేమో అని ఆయనను కనిపెట్టుచుండిరి" (మార్కు 3:2)[22] కడకు, వారు యికను ఏ మాత్రమును ఓర్పుచూపించ లేక, క్రీస్తు ప్రసంగానికి అంతరాయం కలిగిస్తూ, "విశ్రాంతి దినమున స్వస్థపరచుట న్యాయమా?" అని వారాయనను అడిగారు (మత్తయి 12:10).

యేసు భయపడలేదు. "– నీవు లేచి మధ్యను నిలువుమని ఊచచెయ్యిగల వానితో" ఆయన చెప్పాడు (మార్కు 3:3). సమాజం మధ్యను ఆ మనుష్యుడు నిలువబడి యుండగా, తన్ను ప్రశ్నించినవారిని యేసు – "విశ్రాంతి దినమున మేలు చేయట ధర్మమా కీడు చేయుట ధర్మమా[23] ప్రాణ రక్షణ ధర్మమా ప్రాణ హత్య ధర్మమా?" అని అడిగాడు (లూకా 6:9). అందరికి సంబంధించిన సాధారణమైన ఉదాహరణను ఆయన ఉపయోగించాడు:

> అందుకాయన – మీలో ఏ మనుష్యునికైనను నొక గొఱ్ఱెయుండి అది విశ్రాంతి దినమున

గుంటలో పడిన యెడల దాని పట్టుకొని పైకి తీయడా?[24] గొఱ్ఱెకంటె మనుష్యుడెంతో శ్రేష్ఠుడు; కాబట్టి విశ్రాంతి దినమున మేలు చేయుట ధర్మమే ... (మత్తయి12:11, 12).

కనికరములేని (మార్కు 3:5) తన శత్రువుల స్థితినిబట్టి హృదయం నలిగినవాడైన యేసు, ఆ మనిషితో "నీ చెయ్యి చాపుమనెను" (మత్తయి 12:13ఎ). "వాడు చెయ్యి చాపగా రెండవదాని వలె అది బాగుపడెను" (13బి వ.). అది అందరు చూడగల అద్భుతమైయుంది!

ఆయన మరల తన శత్రువుల నోరు మూయించాడు. అయితే వారు తమ ఓటమిని అంగీకరించ సిద్ధపడలేదు. వారు వెలుపలికిపోయి, "ఆయనను ఏలాగు సంహరింతుమా అని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి" (12:14). దాదాపుగా నమ్మశక్యముకాని వివరణను మార్కు యిలా యిస్తున్నాడు: "పరిసయ్యులు వెలుపలికిపోయి వెంటనే హేరోదీయులతో కలిసికొని, ఆయననేలాగు సంహరింతుమాయని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి" (మార్కు 3:6). పరిసయ్యులు హేరోదీయులను తృణీకరిస్తారు[25] అయితే క్రీస్తును అంతమొందించడానికి వారికి రాజకీయ పలుకుబడి అవసరమని తలంచారు. వారు హేరోదీయులను ద్వేషించినమాట వాస్తవమే కాని వారు క్రీస్తును అంతకంటే అధికంగా ద్వేషించారు.

సబ్బాతు వివాదాన్ని గూర్చిన అంశాన్ని విడుచుటకు ముందు, దేవుని సబ్బాతు చట్టాలను యేసు ఎన్నడూ ఉల్లఘించలేదని, అలా చేయడానికి ఆయన ఎవనిని ప్రోత్సహించియుండలేదని నొక్కి చెప్పనిమ్ము. అయితే, ఆయా సమయాలలో, మనుష్యులు కల్పించిన సంప్రదాయాలను ఆయన అతిక్రమించిన మాట వాస్తవం. ఇదే ఆయన శత్రువులను కోపోద్రేకులను చేసింది. యేసు బహిరంగ పరిచర్యకు సంబంధించి మనం చదివే భాగం సగం కూడా కాలేదు. అయితే అప్పటికే ఆయన శత్రువులు ఆయనను ఆయన ప్రభావాన్ని నాశనం చేయడానికి రాత్రనక పగలనక ప్రయత్నిస్తున్నారు! "ఈ పాయింటునుండి, యేసు జీవితానికి వ్యతిరేకంగా సువార్త రచనలలోగుండ కుట్ర అనే రక్తవర్ణపు (దార) గీత పరుగిడుతుంది" అని J. W. మెగార్వే వ్రాశాడు.[26]

## కార్యములతో నైరుద్యానికి బదులిచ్చుట

మూడు సబ్బాతు ఎదుర్కోలులకు బదులుగా, ప్రభువైన యేసు రెండు ముఖ్యమైన చర్యలను తీసికొన్నాడు.

### తన శత్రువులనుండి వేరగుట (మత్తయి 12:13-21; మార్కు 3:7-12)

మొదటిగా, సంఘర్షణ అధికం కాకుండడానికిగాను తన శత్రువుల వద్దనుండి తొలిగిపోవడానికి క్రీస్తు పూనుకున్నాడు. "అంతట పరిసయ్యులు వెలుపలికిపోయి, ఆయనను ఏలాగు సంహరింతుమా అని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి. యేసు ఆ సంగతి తెలిసికొని అచ్చటనుండి వెళ్లిపోయెను" అని మత్తయి దాఖలు చేశాడు (మత్తయి

12:14, 15ఎ). సంఘర్షణను తగ్గించడానికిగాను క్రీస్తు చేసిన తొలి ప్రయత్నం వారినుండి తొలిగిపోవడం, మరికొన్ని ఉండవచ్చు.

"యేసు తన శిష్యులతోకూడ సముద్రమునొద్దకు (సముద్రమనేది గలిలయ సముద్రం) వెళ్లగా ..." (మార్కు 3:7ఎ). అక్కడ కూడా జనులు ఆయనను కనుగొని చూచారు: "గలిలయనుండి వచ్చిన గొప్ప జనసమూహము ఆయనను వెంబడించెను ... యూదయ నుండియు, యెరూషలేమునుండియు ఇదూమయనుండియు,[27] యొర్దాను అవతల నుండియు, తూరు సీదోను[28] అనెడి పట్టణ ప్రాంతముల నుండియు ఆయన యొద్దకు గుంపులు గుంపులుగా వచ్చిరి" (మార్కు 3:7బి, 8). యేసు ప్రజలకు బోధించాడు,[29] వారి రోగాలను బాగుచేశాడు, దయ్యాలను వెళ్లగొట్టాడు; అయితే ఆయన చేసిన వాటిని ప్రచురించవద్దని ప్రతివానికి దాదాపుగా ఆదేశించాడు (మత్తయి 12:15, 16; మార్కు 3:11, 12ను చూడు). ఇంకా ప్రచారం జరిగితే తన్ను ద్వేషించే వారికి అది యింకా కోపం కలిగిస్తుంది.

జరిగినది ప్రతిదీ ప్రవచనం యొక్క నెరవేర్పని మత్తయి నొక్కి చెప్పాడు (మత్తయి 12:17-21; యెషయా 42:1-4 చూడు): యేసు పట్టణంలోనుండి వెళ్లిపోవడం, మౌనం పాటించడం అనేవి ప్రవచనపు నెరవేర్పేనట. "ఈయన జగడమాడడు, కేకలు వేయడు వీధులలో ఈయన శబ్దమెవనికిని వినబడదు" (మత్తయి 12:19). రోగుల యెడలను బలహీనులయెడలను ఆయన కనుపరచిన శ్రద్ధ అక్కర "నలిగిన రెల్లు" "మకమకలాడుచున్న అవిసెనార"గా సూచింపబడినట్టున్నది (20 వ.). పాలస్తీనాకు (ఇదూమయ, తూరు, సీదోనుల నుండి) వెలుపలనుండి వచ్చిన జనులతో ప్రభువు గలిలయ పరిచర్య అన్యజనులకు దీవెనగా ఉంది (మత్తయి 12:18, 21).

యేసు బోధించుటకును, రోగులను బాగుచేయుటకును కొనసాగిస్తున్నాడు, కాని వెంటనే యూదా మత నాయకులతో సంఘర్షణ రాకుండా తన కార్యాలను చేయ జూస్తున్నాడు.

## తన శిష్యులలో నుండి ఏరి ఎన్నుకోవడం

## (మత్తయి 10:2-4; మార్కు 3:13-19; లూకా 6:12-16)

ఆయన వెళ్లిపోయిన తరువాత తన పనిని కొనసాగించడానికిగాను పన్నిద్దరిని ఏర్పరచి తాను చూపిన వ్యతిరేకతకు బదులు తెలిపాడు. ఆయన రోజులు వేళ్లమీద లెక్కింపదగినవిగా ఉన్నాయి.[30] కనుక తన మరణమునకు ముందు శిష్యులను తర్ఫీదు చేయడం ఎంతో అవసరం. వీరు ఎన్నుకోబడినట్టు మార్కు తెలిపాడు: "వారు తనతో కూడ ఉండునట్లును దయ్యములను వారిని ఎన్నుకొనినట్టు వెళ్లగొట్టు అధికారముగలవారై సువార్త ప్రకటించుకును వారిని పంపవలెనని ఆయన పండ్రెండు మందిని నియమించెను" (మార్కు 3:14). వారు ఆయనతో పయనిస్తారు; ఆయన బోధనయందును, మాదిరియందును పాఠాలు నేర్చుకుంటారు. వారు అనుభవం గడించునట్లు ప్రత్యేకమైన పనిమీద వారు పంపబడతారు. వారు తర్ఫీదును పొందుతారు. అప్పటినుండి, క్రీస్తు ప్రయాస ఎక్కువగా తన అపొస్తలులను సిద్ధపరచడానికి మళ్లింది.

ఆ పన్నిద్దరిని ఏర్పరచుకొనడం దేవునితో సంప్రదింపులు జరుపకుండ జరుగలేదు.

యేసు తన నిర్ణయాన్ని తీసికొనకముందు, "ప్రార్థించుటకు కొండకు వెళ్లి,[31] దేవుని ప్రార్థించుటయందు రాత్రి గడిపెను" (లూకా 6:12). నిర్ణయాలన్నింటికి ముందు ప్రార్థన ఉండాలి.

క్రీస్తు తన చుట్టు పూర్తికాలం శిష్యులుగా ఉన్నవారిని సమకూర్చాడు.[32] ఆ రాత్రి ప్రార్థించిన తరువాత, "ఆయన తన శిష్యులను పిలిచి, వారిలో పండ్రెండు మందిని ఏర్పరచి, వారికి అపొస్తలులు అను పేరు పెట్టెను" (లూకా 6:13; మత్తయి 10:2 కూడ చూడు). "అపొస్తలుడు" అనే మాటకు "పంపబడినవాడు" అని అర్థం. ఒక ప్రత్యేకమైన పనిమీద ఒకని పంపినప్పుడు ఈ పదాన్ని సాధారణంగా ఉపయోగించవచ్చు,[33] కాని ప్రభువైన యేసు స్వయంగా పంపిన పన్నెండుమందికి ఈ పదం ముఖ్యంగా వర్తిస్తుంది.[34]

పన్నిద్దరిని ఏర్పరచుకొనడం అనే వాస్తవం ప్రాధాన్యతను సూచింపవచ్చు: "పన్నెండు" అంటే యూదులకు ప్రత్యేకమైన భావాన్ని యిస్తుంది; హెబ్రీ భావనలో, అది మత సంపూర్ణతను సూచిస్తుంది.[35] పన్నిద్దరు గోత్రకర్తలు, పన్నెండు గోత్రాలు ఇశ్రాయేలుకు ఉన్నాయి. ఇప్పుడు క్రీస్తు పన్నిద్దరు అపొస్తలులను[36] ఏర్పరచుకొన్నాడు.

మార్కులో అపొస్తలుల జాబితా యిలా యివ్వబడింది:

> … ఆయన పేతురను పేరుపెట్టిన సీమోను, జెబెదయి కుమారుడగు యాకోబు, అతని సహోదరుడగు యోహాను; వీరిద్దరికి ఆయన బోయనేర్గెసను పేరు పెట్టెను; బోయనేర్గెసు అనగా ఉరిమెడు[37] వారని అర్థము. అంద్రెయ, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, తోమా, అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయి, కనానీయుడైన సీమోను, ఆయనను అప్పగించిన ఇస్కరియోతు[38] యూదా అనువారు (మార్కు 3:16-19).[39]

లూకా జాబితా ఈ దిగువ యివ్వబడింది:

> … ఆయన ఎవనికి పేతురు అను మారుపేరు పెట్టెనో ఆ సీమోను, అతని సహోదరుడైన అంద్రెయ, యాకోబు, యోహాను, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, తోమా, అల్ఫయి కుమారుడైన యాకోబు, జెలోతే అనబడిన సీమోను, యాకోబు సహోదరుడైన యూదా, ద్రోహియగు ఇస్కరియోతు యూదా అను వారు (లూకా 6:14-16).

మత్తయి తన జాబితాను కొంతకాలమైన తరువాత వెలువడించాడు. అంటే, తర్ఫీదు[40] కావడానికి ప్రభువు పన్నిద్దరిని పంపినప్పుడు మత్తయి దీన్ని ప్రచురించాడు. అయినా పోల్చి చూడడానికి ఈ జాబితాను కూడా చూద్దాం:

> ఆ పండ్రెండుమంది అపొస్తలుల పేళ్లు ఏవనగా, మొదట పేతురనబడిన సీమోను, అతని సహోదరుడగు అంద్రెయ, జెబెదయ కుమారుడగు యాకోబు, అతని సహోదరుడగు యోహాను; ఫిలిప్పు, బర్తొలొమయి; తొమా, సుంకరియైన మత్తయి, అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయియను మారు పేరుగల లెబ్బయి; కనానీయుడైన సీమోను, ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా (మత్తయి 10:2-4).

చివరి జాబితా అపొ. 1లో కన్పిస్తుంది. యూదా స్థలంలో మరొకని నియమించక

ముందు జాబితా యిలా యివ్వబడింది: "... పేతురు, యోహాను యాకోబు, అంద్రెయ, ఫిలిప్పు, తోమా, బర్తొలొమయి, మత్తయి, అల్ఫయి కుమారుడగు యాకోబు, జెలోతే అనబడిన సీమోను, యాకోబు కుమారుడగు యూదా అను వారు" (అపో. 1:13).

ఈ నాల్గు జాబితాలను పోల్చి చూడడంవలన ప్రయోజనం ఉంటుంది. ఉదాహరణకు, గమనించు, పేతురు ప్రతి జాబితాలోను ముందుగా పేర్కొనబడ్డాడు. పేతురు "తొలి పోపు" అనే భావనను మాత్రం యిది నిరూపించదు. అతనికున్న తలాంతులు, అతని తొందరపాటువలన అతడు అపొస్తలులకు సహజ నాయకుడు కాలేకపోయాడు. యూదా యొక్క పేరు మొదటి మూడు జాబితాల్లో ఉంది. అతని అపకీర్తి కార్యము అతని అయోగ్యునిగా చేసింది.

ఇతర వివరాలను కూడా సూచించవచ్చు. ఉదాహరణకు, సహోదరుల జంటలున్నాయి. (తద్దయి అనేవాడు యాకోబుకు కుమారుడైన యూదాలా కన్పిస్తాడు). ప్రతి జాబితా కూడా నాల్గు పేర్లతో మూడు సెట్లుగా చేయవచ్చు: మొదటి గ్రూపులో పేతురు ముందుంటాడు. రెండవ గ్రూపులో ఫిలిప్పు, మూడవ గ్రూపులో అల్ఫయి కుమారుడగు యాకోబు ఉంటాడు. పేర్ల అమరికలో మార్పులున్నందున, ఈ మూడు గ్రూపుల్లోను ఈ ముగ్గురు పేర్లు మొదట ఉండడం కావాలని చేసినట్లుంది. పేతురు, ఫిలిప్పు, అల్ఫయి కుమారుడగు యాకోబు అనే వారు తర్ఫీదు పనులలోను, ప్రత్యేకమైన కార్యక్రమాల్లో "గ్రూపు నాయకులైయుండవచ్చు."

తిరిగి జాబితాలను మరోసారి చూడు. వీరిలో పలువురిని మనం గత పాఠాల్లో చూచాం: పేతురు, అంద్రెయ (యోహాను 1:40, 41; మత్తయి 4:18), యాకోబు, యోహానులు (మత్తయి 4:21[41]), ఫిలిప్పు, ఒకవేళ బర్తలొమయి[42] (యోహాను 1:43, 45), మరియు మత్తయి (మత్తయి 9:9). తక్కిన వారిని గూర్చి క్రొత్త నిబంధనలో ఎక్కువగా చెప్పబడలేదు. అయితే వారిని గూర్చి మనకు మూడు ప్రధానమైన వివరాలు తెలుసు. వారందరు పేతురు, అంద్రెయ, యాకోబు, యోహాను, మత్తయిలు పిలువబడినట్టుగానే పిలువబడియుంటారు. రెండవది, పేతురు తక్కిన వారివలె గతంలో చేసిన ఆత్మసాధనకుగాను వారు ఎన్నుకొనబడలేదు. వారికి కలిగిన శక్తివలన ఎన్నుకోబడ్డారు. (యేసు, వారి బలహీనతలను వారి లోపాలను లక్ష్యపెట్టలేదు కాని వారు ఏమి కాగలరో దానిని ఆయన దృష్టి ఉంచాడు. నేడు కూడా ఆయన ఆలాగే చూస్తాడు గనుక దేవునికి స్తోత్రము). మూడవది, ఉపదేశించడానికిని, దయ్యాలను వెళ్లగొట్టడానికిని వారందరు ప్రభువుచే ప్రభావము పొందారు (మత్తయి 10:1 చూడు). ఈ వివరాలన్నిటికి, "ఇస్కరియోతు యూదాతో చేర్చి" అని కలపాలి.

## ముగింపు

ఈ పన్నిద్దరిని ఏర్పరచుకొనడంతో కొండమీద ప్రసంగానికి ప్రేరణ కలిగినట్టయింది. తరువాత రెండు పాఠాలలో దాన్ని చదువ బోతాం. ఏదియెలాగున్నా, కొన్ని చివరి సంగతులను చెప్పనిమ్ము.

క్రీస్తుకు సైతం విమర్శలు కలిగాయి. అయితే, అది ఆయన పనిని నిరూత్సాహ పరచలేదు. దేవుని సంకల్పం నెరవేర్చడానికి అవసరమైనదేదో దాన్ని జరిగించడంలో ఆయన కొనసాగాడు.

నీవుకనుక మంచి పనిని చేసినట్టయితే విమర్శలు తప్పవు. (ఈ విషయం మనం తరువాత పాఠంలో చూస్తాం [మత్తయి 5:11]). విమర్శ వచ్చినప్పుడు, నీవు సంపూర్ణంగా దేవుని సంకల్పానికి బద్ధుడవై ఉండేలా నిశ్చయం చేసికో (1 పేతురు 4:14–16). నీవు అలా ఉన్నట్టయితే, విమర్శకు నిరాశపడకుండా ఉండు. పైగా, విశ్వాసంతో వీడకుండా ఉండడానికి సర్వ ప్రయత్నాలు చేయి.

---

సూచనలు

[1]ఈ పాఠానికి తొలిపలుకుగా తుఫాను సమకూడిన పటమును వాడవచ్చును. [2]గొప్ప గలిలయ పరిచర్యలోని సంఘటనల క్రమం ఆయా పొందికలలో, ఈ పాయింటు దగ్గరనుండి అనేక వ్యత్యాసాలు కనిపిస్తాయి. వాటన్నిటిని చూపడం నా పని కాదు. సంఘటన క్రమం ముఖ్యం కాదు, ఆలా ఉన్నట్టయితే పరిశుద్ధాత్మ తెలిపి ఉండేవాడు. [3]సబ్బాతు దినాన మేకు కొట్టిన పాదరక్షలను ధరించకూడదు. అది మేకును ధరించినట్టౌతుంది … యింకా ఉదాహరణల కొరకు – "యజమానుని కలిసికో" చూడు. [4]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 142. [5]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary,* vol. 1 (Wheaton, Ill.: Victor Books, 1989), 305. [6]Adam Fahling, *The Life of Christ* (St. Louis, Mo.: Concordia Publishing House, 1936), 195. [7]పరిసయ్యులు ఎంతగా ప్రయత్నించినా, సబ్బాతును అతిక్రమించినట్టు తగిన సాక్షాధారాన్ని కనుగొనలేక పోయారు. తన భూ పరిచర్యకు అంతంలో, ఆయనకు జరిగిన తీర్పుల్లో, ఆయన సబ్బాతును ఉల్లఘించినట్టు ఏ విధమైన నేరము ఆయనపై మోపలేదు. [8]యూదుల పండుగలకు సంబంధించిన చార్టును – "క్రీస్తు జీవితం, భాగం1లో" చూడు. [9]ఆయా అవకాశాలకు సంబంధించిన చర్చ – A. T. Robertson, *A Harmony of the Gospels for Students of the Life of Christ* (New York: Harper & Row, 1950), 267-70. [10]"క్రీస్తు జీవితం, భాగం1లో" చూడు.

[11]ఈలాటి చర్చలు యోహాను రచనలో 6 దాఖలు చేయబడ్డాయి. [12]యేసు డిఫెన్స్‌ను పూర్తిగా పరిశీలించడానికి – "దేవునితో సమానము" అనే పాఠంలో ఆరంభమౌతుంది చూడు. [13]James Burton Coffman, *Commentary on John* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1974), 158. [14]యేసు తిరిగి గలిలయలో ఉన్నట్టు తలంచుతాం. తరువాత కథ ఒక సమాజమందిరంలో జరుగుతుంది. అది పంట చేలలో యేసును సవ్వాలు చేసిన పరిసయ్యులు వెళ్లే సమాజమందిరమన్నట్టు మత్తయి సూచిస్తున్నాడు (మత్తయి 12:2, 9). మార్కు ప్రకారం, ఈ సమాజమందిరము సముద్రానికి సమీపంగా ఉన్నట్టు సూచిస్తున్నాడు (మార్కు 3:5–7). [15]పస్కా జరిగిన వెంటనే ఈ సంఘటన జరిగియుంటే, అది యవల పంటయైయుంటుంది. [16]లూకా ప్రకారమైతే, పరిసయ్యులు ఆయన శిష్యులను ఎదుర్కొన్నారు. మత్తయి, మార్కుల ప్రకారమైతే పరిసయ్యులు యేసును సవ్వాలు చేశారు. రెండు జరిగే ఉండవచ్చు. [17]దేవుని చట్టాలను ఉల్లఘించవచ్చుననడానికి రుజువుగా ఈ ఉదాహరణలో దేనిని ఉపయోగించరాదు. ప్రభువు యొక్క పాయింటు ఏమంటే – యూదా మతనాయకులు దావీదును నేరస్థునిగా ఎంచనప్పుడు, తన్ను, తన శిష్యులను వారెందుకు నేరస్థులని తీర్చాలి? [18]హోషేయ 6:6 KJVలో "కనికరము" అని ఉంది, NASBలో "ప్రభుభక్తి" అన్నట్టుంది [19]"Something" అనేది గ్రీకుకు సరియైన తర్జుమాయైయుంది, అయితే KJVలో గుప్తమైయున్న ఆలోచనను తెలుపుతూ – "ఈ స్థలమందు దేవాలయముకంటె గొప్పవాడున్నాడు – అని నేను మీతో చెప్పుతున్నాను" అని అంటుంది. [20]యూదులకు యిది దుష్టచేష్టగల ప్రతిపాదనయై యుండవచ్చు. ఎందుకంటే, వారికి సంబంధించినంత మట్టుకు, దేవాలయంలో తన ప్రసన్నతను నిలుపు దేవుడే దేవాలయంకంటె గొప్పవాడు.

[21]ఇది మత్తయి రచనలో గుప్తమైయుంది (మత్తయి 12:9). [22]మరణదండణ విధించగల యూదుల సభయెదుట

ఆయన నేరం మోపాలని వారు కోరుకున్నారు. [23]ఏడవ దినాన ప్రాణ రక్షణచేయడానికి వైద్యులకు మరి యితరులకు వారి సొంత చట్టాలే అనుమతిని యిచ్చాయి (Alfred Edersheim, *The Life and Times of Jesus the Messiah*, New Updated Version [Peabody, Mass.: Hendrickson Publishers, 1993], 515). [24]ఇదే ఉదాహరణ యేసు మరో సందర్భంలో ఉపయోగించాడు, జంతువును ఎద్దు అని అన్నాడు (లూకా 14:5). సంఘకూడికకు మానుకొనడానికి లేక అశ్రద్ధచేయడానికి కొందరు ఈ పోలికను ఉపయోగించారు. అందుకని ఒక సువార్తికుడు యిలా అన్నాడు, "నీ యెద్దు నిరంతరం గుంటలో పడుతూ ఉన్నట్టయితే, నీవు ఆ యెద్దునైనా అమ్మాలి లేదా ఆ గుంటనైనా పూడ్చాలి." [25]"క్రీస్తు జీవితం భాగం1లో" హేరోదీయులను గూర్చి క్లుప్తంగా ఉంది. పరిసయ్యులు హేరోదీయులను ద్వేషిస్తారు ఎందుకంటే అన్యుల క్రొత్తదనాలను మహా హేరోదు ప్రోత్సహించాడు. [26]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* ( Cincinnati: Standard Publishing Co.,1914), 198. [27]"ఇదుమియ" ఎదోమీయుల దేశాన్ని సూచిస్తుంది. మహా హేరోదు ఎదోమీయుడు. [28]ఆయా చోట్లకు సంబంధించి దేశపటంలో చూడు. [29]మరో మారు ప్రభువు వద్దకు జనసమూహాలు తరలివచ్చాయి. అయినా ఈ సారి ఆయన పడవను ఉపయోగించుకొన్నది లేనిది మనకు తెలియదు. [30]శిష్యులుగా చేయబడడంలో యిది మూడవ దశ – ఇది ఏర్పరచబడిన కొందరికే ఉద్దేశింపబడిన దశ.

[31]ఇది ఏ పర్వతమనేది నిశ్చయంగా తెలియదు. లూకా 6లోను, మత్తయి 5–7ల్లోను ఉన్న ప్రసంగం ఒక్కటే అయ్యుంటే, అది ఒక్కటే అయ్యుంటాది (మత్తయి 5:1; లూకా 6:12, 17) అది కపెర్నహూముకు దూరమైన కొండ కాదు. మరో అవకాశమేమంటే – Horns of Hattin అనబడే కొండయైయుండవచ్చు. [32]యేసు శిష్యులను పిలుచుకున్న దశ యిది రెండవది. [33]క్రీస్తు దేవునిచే పంపబడినందున ఆయనే అపొస్తలుడనబడ్డాడు (హెబ్రీ. 3:1). సాధారణమైన భావంతో అపొస్తలుడనే పదం–అపొ. 14:14; రోమా 16:7; 2 కొరింథీ. 8:23: ఫిలిప్పీ. 2:25 ఉపయోగించబడింది. (కొన్ని సార్లు అదే గ్రీకు పదం "వర్తమానికుడు" అని తర్జుమా చేయబడింది). [34]"అపొస్తలుడు" అనే పదం యొక్క అర్థంకొరకు "కార్య గ్రంథం భాగం1లో" చూడు. [35]"పండ్రెండు" అనే సంఖ్య ప్రాముఖ్యత కొరకు – "ప్రకటన, 1," ట్రూత్ ఫర్ టుడే (ఫిబ్రవరి 1999) ఆంగ్ల సంచికలో 25–26 పేజీలు చూడు. [36]పన్నెండు గోత్రాలు, పన్నిద్దరు అపొస్తలులకు మధ్య దాచబడిన సంబంధాన్ని మత్తయి 19:28, లూకా 22:30లో చూడు. [37]తమ స్వభావాన్ని సూచించడానికి ప్రభువు వారికి అలా పేరుపెట్టి యుండవచ్చు (లూకా 9:51–56; మార్కు 9:38). ప్రభువు ప్రభావంవలన వారు సంస్కారవంతులయ్యారు. [38]కెరీయోతు అనే యూదా పట్టణంనుండి "ఇస్కరియోతు" అనే పేరు వచ్చియుండ వచ్చు. కెరీయోతు అనేది యూదుల పట్టణం – లేక యూదావారి పట్టణం (యెహోషువ 15:25). ఇస్కరియోతు యూదా మినహాయించి మిగిలిన అపొస్తలులందరు గలిలయులే. [39]ఈ మనుష్యుల్లో కొందరికి యితర పేర్లు పెట్టబడ్డాయి. ఉదాహరణకు, తోమా, "దిదుమ" అని పిలువబడ్డాడు (యోహాను 11:16). [40]మత్తయి పట్టికపై వ్యాఖ్యానం కొరకు "రాజు, రాయబారులు' ' అనే పాఠాన్ని చూడు.

[41]యాకోబు, యోహానులు ప్రభువు యొక్క మొదటి శిష్యులలో చేరినవారై యుండవచ్చు. [42]నతనయేలుకు బర్తొలొమయి అనేది మరొక పేరని అనేకులు తలంచుతారు (యోహాను 1:45–51).